**16-07-2001న లాటూర్ శివాలయ ప్రారంభోత్సవ సందర్భంగా బహిరంగసభలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము**

# ప్రేమద్వారానే అమృతత్వం సిద్ధిస్తుంది

ప్రేమస్వరూపులారా! ఈ ప్రపంచమంతయు ప్రేమతోనే నిండియున్నది. ప్రపంచమనగా కేవలం ప్రాకృతమైన ఆకారం కాదు. ప్రజలే ప్రపంచము. మీరందరూ ప్రేమస్వరూపులే. మీ ప్రేమయే దైవత్వాన్ని ప్రత్యక్షం గావిస్తుంది.

ఈ ప్రపంచంలో ప్రేమ రెండు విధాలుగా ప్రసరిస్తున్నది. ఒకటి ప్రాకృతప్రేమ, రెండవది పరతత్త్వంతోకూడిన ప్రేమ. ప్రాకృతమైన, దేహసంబంధమైన ప్రేమ స్వార్థంతో కూడియుంటుంది. ఎక్కడ స్వార్థం ఉంటుందో అక్కడ భయం ఏర్పడుతుంది. కాని, దైవప్రేమ స్వార్థరహితమైనది. కాబట్టి దైవప్రేమకు ఎట్టి భయమూ లేదు. అంతేకాదు, దైవప్రేమ ప్రేమ నిమిత్తమేగాని, మరొకదాని నిమిత్తం కాదు. అది "నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త, నిర్మలస్వరూపిణం" అట్టి ప్రేమ సర్వత్రా నిండియున్నది. దైవం లేని స్థానం లేదు. ప్రేమయే దైవం, దైవమేప్రేమ. "ప్రేమ్ ఈశ్వర్ హై, ఈశ్వర్ ప్రేమ్ హై" ప్రేమచేతనే ఈశ్వరత్వంలో ఐక్యం కావచ్చును. ఈ దేహం ఎక్కడో ఆంధ్రప్రదేశ్‌లో పుట్టినటువంటిది, మీరంతా మహారాష్ట్రకు చెందినవారు. మీకూ, నాకూ ఉన్నటువంటి సంబంధ మేమిటి? కేవలం ప్రేమయే, ప్రేమయే! నాపై ఉన్నటువంటి ప్రేమచేతనే ఈనాడు మీరందరూ ఇక్కడ సమావేశమైనారు. మీ ప్రేమ నాకెంతో ఆనందాన్ని కల్గిస్తున్నది. ప్రేమయే గొప్ప ఆకర్షణశక్తి. ఈ ఆకర్షణశక్తి జగత్తంతా నిండియున్నది. ప్రేమ అనే "మ్యాగ్నెట్" మీ అందరియందున్నది. ప్రేమ లేని మానవుడు ఈ జగత్తులో కానరాడు. దైవత్వమునకు ఒక ప్రత్యేకమైన రూపం లేదు. ప్రేమయే భగవత్స్వరూపం. భగవంతునియందు ఎలాంటి స్వార్థమూ లేదు. కనుక మానవుడు తన ప్రేమను స్వార్థరహితంగా వినియోగించుకోవాలి. కాని మానవుడు తన ప్రేమను జగత్తుపైన, భార్యా బిడ్డలపైన, ఆస్తిపాస్తులపైన ప్రసరింపజేస్తున్నాడు.

**ప్రాకృత ప్రేమ - దైవప్రేమ**

ప్రాకృతమైన ప్రేమ క్షణక్షణమునకూ మార్పు చెందుతుంటుంది. దీనికొక చిన్న ఉదాహరణ

sri sathyasai vachanamrutam

తీసుకోండి. మానవుడు యుక్తవయస్సులో వివాహ మాడుతాడు. వివాహమైన మూడు నెలల వరకు భర్త "వైఫ్"యే తన "లైఫ్" అని భావిస్తాడు. ఇద్దరూ కలసి ఎక్కడికైనా వెళుతున్నప్పుడు దారిలో అతనికి ముల్లు కనిపిస్తే తక్షణమే భార్య చెయ్యి పట్టుకొని "ముల్లు, ముల్లు" అంటూ వెనక్కి లాగుతాడు. ఆరు నెలల తరువాత మళ్ళీ ఎక్కడైనా ముల్లు కనిపిస్తే భార్యను "అక్కడ ముల్లుంది, జాగ్రత్త" అని హెచ్చరిస్తాడు. ఒక సంవత్సరం తరువాత మళ్ళీ ఇద్దరూ కలసి వెళుతున్నప్పుడు దారిలో ఎక్కడైనా ముల్లు కనిపిస్తే "అక్కడ ముల్లుంది. నీకు కనిపించటం లేదా?" అని కోప్పడతాడు. ఈరీతిగా, ప్రాకృతమైన ప్రేమ దినదినమునకూ తరిగిపోతూ ఉంటుంది. కాని దైవప్రేమ ఎన్నటికీ తరగదు. అట్టి నిత్యసత్యమైన ప్రేమను మీరు పొందాలి.

**ప్రేమరూపము బ్రహ్మంబు ప్రేమమయము**
**ప్రేమ ప్రేమతో సంధింప నీమమగును**
**కాన ప్రేమను గట్టిగా కలిగియున్న**
**అద్వితీయము నొందంగ అర్హుడగును**

మీ అందరియందు ఇట్టి ప్రేమతత్త్వం ఉండటం చేతనే మీరిక్కడ నన్ను చూడగల్గుతున్నారు, నేను మిమ్ములను చూడగల్గుతున్నాను. మీరు కేవలం మానవులు కారు, సాక్షాత్తు విశ్వవిరాట్స్వరూపులు. మీయందు అనంతమైన శక్తి ఇమిడియున్నది. మీయందున్న శక్తి మరెక్కడా లేదు. కాని, దానిని మీరే గుర్తించుకోలేకపోతున్నారు. అందరినీ ప్రేమించండి. అటువంటి పవిత్రమైన ప్రేమను పోషించుకున్నప్పుడే మానవత్వం దివ్యత్వంగా మారిపోతుంది. ప్రత్తి నుండి దారము, దారము నుండి వస్త్రము ఏర్పడినాయి. కనుక ఈ మూడూ ఒక్కటే. అట్లే ప్రకృతి, జీవాత్మ, పరమాత్మ - ఈ మూడూ ఒక్కటే.

**మీరందరూ ఈశ్వరాంశసంభూతులే!**

ప్రేమస్వరూపులారా! మీరు ఆత్మస్వరూపులే గాని, కేవలం దేహస్వరూపులు కారు, మానసిక స్వరూపులు కారు. ఆత్మతత్త్వం గురించి చెబితే అందరూ అర్థం చేసుకోలేకపోవచ్చు. అయితే కూటి పేద మొదలు కోటీశ్వరుని వరకు అందరిలోనూ ప్రేమతత్త్వం ఉన్నది కదా! ఆ ప్రేమయే దైవస్వరూపమనే విశ్వాసాన్ని పెంచుకోండి.

sri sathyasai vachanamrutam

**పూలజాతులు వేరు, పూజ ఒకటే**
**జీవజంతులు వేరు, జీవుండు ఒక్కడే**
**పశులవన్నెలు వేరు, పాలు ఒకటే**
**శృంగారములు వేరు, బంగారమొక్కటే**

చేతులకు వేసుకుంటే అవి గాజులవుతాయి, మెడలో వేసుకుంటే అది హారమౌతుంది, వ్రేలికి పెట్టుకుంటే అది ఉంగరమౌతుంది. ఆభరణాలు వేర్వేరుగాని, బంగారమొక్కటే కదా! అదేరీతిగా, మీ రూపనామములు వేర్వేరుగా ఉన్నాయిగాని, మీరందరూ ఆత్మస్వరూపులే, ప్రేమస్వరూపులే. కాబట్టి మిమ్మల్ని మీరు ద్వేషించుకోవటం తగదు. ఒకరినొకరు ప్రేమించుకోవాలి. ప్రేమద్వారానే అమృతత్త్వం సిద్ధిస్తుంది. అందరియందు ప్రేమ ఉన్నది. కాని ఆ ప్రేమను పెడమార్గంలో ప్రవేశపెడుతున్నారు. ఒక్కొక్క దేహం ఒక్కొక్క బల్బువంటిది. బల్బులు, వాటి రంగులు వేరువేరుగా ఉండవచ్చును. కాని కరెంటు ఒక్కటే కదా! అదేరీతిగా "ఈశ్వర స్సర్వ భూతానాం" అందరియందున్న ఈశ్వరాంశమొక్కటే. కనుక, మీరందరూ ఈశ్వరాంశసంభూతులనే సత్యాన్ని గుర్తించుకోవాలి. మీలో ఉన్న ఈశ్వరాంశమును గుర్తించుకున్నప్పుడే మీ జన్మ ధన్యమౌతుంది. మానవుడు తనయందే ఉన్న ఈశ్వరత్వాన్ని గుర్తించుకోలేక భగవంతుణ్ణి దర్శించాలని ఎక్కడెక్కడో తిరుగుతూ కాలాన్ని వ్యర్థం చేస్తున్నాడు. మీరు అడుగుపెట్టినచోటల్లా దైవత్వమున్నది. "బ్రహ్మాండమంతయు నిండియున్న దైవానికి ఆలయంబు నమర్చ నలవియగునె?" మీ హృదయమే దైవమందిరం. "జీవుడుండు దేహమందు, హృదయమందు దేవుడుండు" కాబట్టి హృదయంలోనే దైవాన్ని దర్శించండి. ఇది సులభమైన మార్గం.

**వాంఛలనే 'లగేజి'ని తగ్గించుకోండి•**

నిజంగా మానవునికి దుఃఖమనేదే లేదు. దుఃఖమునకు అసలు అవకాశమే లేదు. మానవుడు ఆనందమయుడు. కాని, లేనిపోని విషయవాంఛలను పెంచుకొని దుఃఖానికి గురి అవుతున్నాడు. "సుఖదుఃఖే సమేకృత్వా లాభాలాభౌ జయాజయౌ." సుఖదుఃఖములపట్ల సమత్వం వహించాలేగాని, వాటికి లొంగిపోకూడదు. మానవునిలో వాంఛలు పెరిగిపోవటంచేత తన ప్రేమను వివిధరకములైన మార్గములలో వినియోగించుకుంటున్నాడు. Less luggage

sri sathyasai vachanamrutam

more comfort make travel a pelasure. ఈ జీవితయాత్రలో కోరికలనే 'లగేజి'ని ఎంత తగ్గించుకుంటే మీ ప్రయాణం అంత సుఖప్రదంగా సాగుతుంది. సుఖ దుఃఖములకు మనస్సే కారణం. "మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" మనస్సును భగవంతునివైపు త్రిప్పినప్పుడే మోక్షం లభిస్తుంది.

కాని, మానవుడు తన మనస్సును ప్రపంచంవైపు మరల్చటంచేత బంధితుడౌతున్నాడు. "జంతూనాం నరజన్మ దుర్లభం" అన్నారు. నరజన్మ దివ్యమైనది, దుర్లభమైనది. ఇట్టి మంగళకరమైన మానవత్వాన్ని మానవుడు మంటగలుపుతున్నాడు. మానవుడు తన తత్త్వాన్ని తాను గుర్తించుకునే నిమిత్తం భగవంతుడు అనుగ్రహించిన వరప్రసాదం దేహం. కనుక దేహాన్ని ఒక పనిముట్టుగా భావించి, దానిని సద్వినియోగపరచుకోవాలి.

**భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శించండి**

చేతులు, కాళ్ళు, ముక్కు, చెవులు, కన్నులు... ఇవన్నీ దేహానికి అంగములు. దేహం సమాజానికి అంగము. సమాజం ప్రకృతికి అంగము. ప్రకృతి పరమాత్మకు అంగము. ఒక్కొక్క అంగమును వేరుచేస్తే దేహమే లేదు. అదేరీతిగా, వివిధ రాష్ట్రముల మధ్య ఐకమత్యం లేనప్పుడు దేశమే నిలువజాలదు. మన ప్రాచీనులు దేశమునే తమ ఇల్లుగా భావించేవారు. "మేము భారతీయులం" అని గర్వంగా చెప్పుకునేవారు. కాని, ఈనాటి ప్రజలలో అట్టి దేశభక్తి క్షీణించింది. "నాది మహారాష్ట్ర", "నాది తమిళనాడు", "నాది కర్ణాటక" ... ఇలాంటి సంకుచితమైన భావంతో ప్రజలు దేశాన్ని విభజిస్తున్నారు. తత్ఫలితంగా దేశంలో ఐకమత్యం క్షీణించిపోతోంది.

ప్రేమస్వరూపులారా! మేము భారతీయులమనే విశాలమైన భావాన్ని పోషించుకోండి. అందరూ ఒక్కటే, అందరినీ ప్రేమించాలి. మీరు మానవజాతికి చెందినవారు. కాబట్టి, మానవతావిలువలను కోల్పోవటంచేతనే ప్రపంచం ఛిన్నాభిన్నమవుతోంది. త్రికరణశుద్ధియే మానవత్వం. కనుక మానవుడు త్రికరణశుద్ధిని కల్గియుండాలి. మానవత్వంలో ఉన్నదివ్యత్వాన్ని గుర్తించుకోవాలి. మీరే సత్యస్వరూపులు, మీరే ప్రేమస్వరూపులు. కాబట్టి మీరు ఎవ్వరినీ ద్వేషించకూడదు, బాధించకూడదు. ఎవరిని బాధించినా మిమ్మల్ని మీరు బాధించుకున్నట్లే! సర్వ మానవులలోని ఏకత్వాన్ని దర్శించినప్పుడే మానవత్వం దివ్యత్వంగా మారిపోతుంది.

sri sathyasai vahanamrutam

మానవులంతా విశ్వకుటుంబంలో సభ్యులు. అందరూ భగవంతుని బిడ్డలే. అందరూ సోదరసోదరీమణులే. ఒకే కుటుంబానికి చెందిన వారి మధ్య ఎందుకీ ద్వేషాలు? ఎందుకీ జగడాలు? మానవునిలో ద్వేషము, క్రోధము, అసూయ, డంబము... ఇత్యాది దుర్గుణాలు ప్రవేశించి హృదయాన్ని విషమయం గావిస్తున్నాయి.

## సేవలో ఉన్న ఆనందం మరి దేనియందూ లేదు

ప్రేమస్వరూపులారా! ప్రేమచేత మీరెంతటి ఘనకార్యమునైనా సాధించవచ్చును; పంచభూతములనుకూడా మీరు స్వాధీనం చేసుకోవచ్చును. పంచభూతములు స్వాధీనమైనప్పుడు ప్రపంచమే మీ వశమౌతుంది. కనుక, మీరు అల్పులమని భావించకండి. మీరు చాలా ఉన్నతమైనవారు. కాని, అజ్ఞానంచేత మీరు అల్పులమని భావిస్తున్నారు. ఈ అజ్ఞానమును దూరం చేసుకోవటానికి మీరు ప్రేమను పెంచుకోవాలి; ప్రేమను పెంచుకుంటే ప్రపంచమంతా ఒక్కటైపోతుంది. ప్రేమ అనంతమైనది, అగాధమైనది, అమృతమైనది. ఇలాంటి ప్రేమతత్త్వాన్ని మీరు గుర్తించుకోలేకపోతున్నారు. తపస్సుచేతగాని, తీర్థయాత్రలచేతగాని, జపతపాదులచేతగాని సంసార సాగరమును తరించుటకు సాధ్యం కాదు. జన్మ సార్థకం కావాలంటే ప్రేమతో దీనులకు సేవ చేయాలి. సేవలో లభించే ఆనందం మరి దేనియందూ లభించదు, ఎంత ధనమిచ్చినప్పటికీ లభ్యం కాదు.

ఈ ప్రపంచంలో ఎంతోమంది ధనమునార్జించారు. కాని, కట్టకడపటికి ఏమి చేశారు? ఒక్కడైనా ఒక్క నయాపైస అయినా తనవెంట తీసుకొని పోయినాడా? పోయేటప్పుడు పిడికెడు మట్టిని కూడా తీసుకొనిపోవటానికి వీలుకాదు. పోయే ప్రతి వ్యక్తీ తనవెంట పిడికెడు మట్టినైనా తీసుకువెళ్ళగల్గితే, ఈపాటికి ప్రపంచంలో మట్టికికూడా 'రేషన్' వచ్చియుండేది. జీవితంలో మీరు చేసిన మంచిచెడ్డలే మీవెంట వస్తాయి. మీరు గొప్ప పదవుల నేలవచ్చు. ఎంతో ధనమును సంపాదించవచ్చు, గొప్పవారిగా పేరొందవచ్చు. కాని, చివరికి ఏదీ మీవద్ద ఉండదు. గొప్పతనం కదలిపోయే మేఘంవంటిది.

మీరు గొప్పపేరు సంపాదించుకోనక్కర్లేదు, మంచిపేరు సంపాదించు కుంటే చాలు. రావణుడు ఎంతోగొప్పవాడు. కాని మంచివాడు కాదు. శ్రీరాముడు మంచివాడుగా పేరు

srisathyasaivachanamrutam

తెచ్చుకున్నాడు. ఎందుకంటే తనలో ఉన్న సద్గుణాలను వినియోగించుకున్నాడు. రావణునిలోనూ సద్గుణాలు లేకపోలేదు. కాని అతడు వాటిని ఆచరణలో పెట్టలేదు. మీరు మంచివారు కావాలి. భారతీయులందరూ మంచివారనే సత్కీర్తిని పొందండి.

ఈ ప్రపంచానికి వచ్చినందుకు మేమేమి సాధిస్తున్నాము? మా జీవితపరమావధి ఏమిటి? అని ఒక్కసారి మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. "ఖానా, పీనా, సోనా, మర్నా" – మీరు పుట్టింది ఇందుకోసమేనా? కాదు, కాదు. ఇవన్నీ పశుపక్ష్యాదులుకూడా అనుభవిస్తున్నాయి. వాటికైనా ఒక 'రీజన్' ఉన్నది, 'సీజన్' ఉన్నది. కాని, ఈనాటి మానవుడు ఒక 'రీజన్'గాని, 'సీజన్'గానీ లేకుండా ప్రవర్తిస్తున్నాడు; దుర్గుణాలకు లొంగిపోయి పవిత్రమైన తన ఇంద్రియశక్తిని వ్యర్థం చేస్తున్నాడు. ఇంద్రియాలను సద్వినియోగ పరచుకున్నప్పుడే మీరు మంచివారుగా రూపొందగలరు.

ఈనాటి మానవుడు తన కర్తవ్యాన్ని విస్మరించి అధికారంకోసం ప్రాకులాడుతున్నాడు. అధికారం కావాలంటే మొట్టమొదట కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. ఆడంబరానికి అవకాశమీయకూడదు. దుర్గుణములు, దుర్బుద్ధి, దుష్టతనములను దూరం చేసుకొని భక్తి, క్రమశిక్షణ, కర్తవ్యపాలనములను అలవరచుకోవాలి. కేవలం పుస్తకాలలో ఉన్నది మస్తకాలలో నింపుకుంటే ప్రయోజనం లేదు. ప్రేమను పెంచుకోవాలి. అందరినీ అన్నదమ్ములుగా, అక్కచెల్లెళ్ళుగా భావించి ఆదరించాలి. బాధలలో ఉన్నవారిని ఆప్యాయంగా ఆదుకోవాలి. ఆత్మ గౌరవాన్ని నిల్పుకోవాలి. ఆత్మవిశ్వాసాన్ని అభివృద్ధి పరచుకోవాలి. అప్పుడే మానవత్వం దివ్యత్వంగా మారిపోతుంది.

భగవద్గీతలో కృష్ణుడు చెప్పాడు "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః". దేహభ్రాంతితో మీరు మానవులమని భావిస్తున్నారుగాని, మీరందరూ దైవాంశసంభూతులే. హిందువులుగాని, క్రిష్టియన్లుగాని, సిక్కులుగాని, ముస్లింలుగాని... అందరియందున్న ఈశ్వరత్వం ఒక్కటే. ఉన్నది ఒకే కులం, అదే మానవకులం. ఉన్నది ఒకే మతం, అదే ప్రేమమతం. కనుక మీరు ఐకమత్యంగా, అన్యోన్యంగా జీవితాన్ని గడపండి. ఈనాడు పల్లెప్రజలందే కొంతవరకు అన్యోన్యత, ఐకమత్యం ఉన్నాయి. పట్టణాలలో ఒకరినొకరు "హలో, హౌ ఆర్ యు? ..."

srisathyasaivachanamrutam

అంటూ పలకరించుకుంటారేగాని, వారిమధ్య అన్యోన్యత, ఐకమత్యం కానరావు. హిందువులు, క్రిష్టియన్లు, ముస్లింలు ... అంతా ఒక్కటే. మతభేదాలను విడనాడి, దైవం ఒక్కడే అన్న సత్యాన్ని గుర్తించండి.

**గుండెలోన ప్రేమ పండించుకొనుచున్న**
**అతడె క్రైస్తవుండు, అతడె సిక్కు**
**అతడె హైందవుండు, అతడె ముస్లిమ్**
**అతడె మానవుండు వసుధలోన**

కనుక హృదయంలో ప్రేమతత్త్వాన్ని పెంచుకోవాలి. ఎవరితోనూ వైరం పెట్టుకోవద్దు.

ప్రేమస్వరూపులారా! ఈ మహారాష్ట్ర ప్రాంతంలో ఎందరో మహనీయులు జన్మించారు. ఇట్టి పవిత్రమైన క్షేత్రంలో నివసిస్తున్న మీరు పవిత్రమైన జీవితాన్ని గడపాలి. భగవన్నామము నుచ్చరించని నాలుక, పరులకు ఉపకారం చేయని హస్తములు నిరర్థకమైనవి. నిరంతరం పరమాత్మచింతన చేయండి. ఈశ్వరనామాన్ని స్మరించండి. దేశప్రజలందరూ హృదయపూర్వకంగా భగవచ్చింతన చేస్తే, దేశమెంతో పురోభివృద్ధి నొందగలదు; మనం సహాయం కోసం ఇతర దేశాలను ఆశ్రయించనక్కర్లేదు. భారతదేశానికి ఉన్నటువంటి గొప్ప శక్తి ఏ దేశానికీ లేదు. భారతదేశం అన్ని దేశములకూ నాయకత్వం వహించినటువంటిది. “భారతదేశము యొక్క భాగ్యమేమని చెప్పవచ్చు? ఈ దేశమునందు హరి పలుమారులు పుట్టుచు తత్త్వముపదేశించుచున్నాడు!”

ప్రేమస్వరూపులారా! మీరందరూ సుఖశాంతులను, ఆనందభాగ్యములను పొందుదురు గాక! మీరు ఐకమత్యంగా ఉంటే ఎంతటి సౌభాగ్యమైనా పొందవచ్చు. కేవలం కొంతమంది మంత్రులు కలసి దేశాన్ని ఉద్ధరించాలంటే ... అది సాధ్యం కాదు. మీరందరూ ఏకమై ఆ మంత్రులకు తగిన సహాయము నందించాలి. ఒక దారపుపోగును రెండు వ్రేళ్ళతో త్రుంచివేయవచ్చుకాని, అనేక దారములను చేర్చి వస్త్రమును తయారు చేసినప్పుడు అదెంతో దృఢంగా ఉంటుంది. అదేరీతిగా, ప్రజలు, ప్రభుత్వం ఏకమైనప్పుడు ఎంతటి గొప్ప పనైనా చేయటానికి వీలౌతుంది. కాబట్టి, ఐకమత్యాన్ని సాధించండి. మీరందరూ సమాజ సంక్షేమాన్ని

sri sathyasai vachanamrutam

ఆకాంక్షించి, సమాజాభివృద్ధికై కృషి చేసి, శాశ్వతమైన ఆనందాన్ని పొందుతారని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను. సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని దైవప్రార్థన చేయండి.

("శివాయ పరమేశ్వరాయ చంద్రశేఖరాయ నమః ఓం..." అనే భజనతో శ్రీవారు తమ దివ్యోపన్యాసాన్ని ముగించారు)

**(16-07-2001న లాటూర్‌కి సమీపంలోని చాకూర్‌లో శివాలయ ప్రారంభోత్సవ సందర్భంగా ఏర్పాటైన బహిరంగసభలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

sri sathyasai vachanamrutam